క్లుప్తంగా

కేటీఆర్‌కు నాయకుల శుభాకాంక్షలు



కేటీఆర్‌తో బీఆర్‌ఎస్‌ నేతలు

సిరిసిల్లటౌన్‌: బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌ను మంగళవారం సిరిసిల్ల యువకులు హైదరాబాద్‌లో కలిశారు. మాజీ కౌన్సిలర్‌ గుండ్లపెల్లి పూర్ణచందర్‌ ఆధ్వర్యంలో యువ నాయకులు వెగ్గలం శ్రీనివాస్‌, ఓరగంటి విష్ణు, వేముల విశాల్‌, సింగం శరత్‌, శ్రీపతి సురేశ్‌, పులి క్రాంతి తదితరులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

మూడునెలల్లో 47 సెల్‌ఫోన్ల అప్పగింత



సెల్‌ఫోన్‌ అప్పగిస్తున్న ఎస్సై

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలపరిధిలో మూడునెలల్లో పోగొట్టుకున్న 47 సెల్‌ఫోన్లను వెతికి బాధితులకు అప్పగించినట్లు ఎస్సై రమాకాంత్‌ తెలిపారు. మండలకేంద్రానికి చెందిన రామిండ్ల రత్నయ్య రెండునెలల క్రితం సెల్‌ఫోన్‌ పోయినట్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. సీఈఐఆర్‌ యాప్‌ ద్వారా సెల్‌ఫోన్‌ గుర్తించి అప్పగించినట్లు తెలిపారు.

కార్యవర్గం ఎన్నిక

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్‌ ముదిరాజ్‌ యువసేన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోల దేవరాజు, ఉపాధ్యక్షుడిగా బొమ్మనవేని వెంకటేశ్‌, క్యాషియర్‌గా అల్లె రాజు, బొమ్మనవేని రవిను ఎన్నుకున్నారు. మాజీ అధ్యక్షుడు బొమ్మనవేని కృష్ణ, ఉపాధ్యక్షుడు కోల బాలనర్సు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండల పాస్టర్స్‌ ఫెలోషిప్‌ కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాస్టర్‌ రాజేశ్‌, ఉపాధ్యక్షుడిగా పాస్టర్‌ దేవరాజు, సెక్రటరీగా దేవరాజు, జాయింట్‌ సెక్రటరీగా పాస్టర్‌ యోబు, ట్రెజరర్‌గా పాస్టర్‌ రాజును ఎన్నుకున్నారు. సలహాదారులుగా పాస్టర్‌ క్రీసుదాసు, పాస్టర్‌ అబ్రహాంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండేళ్లపాటు వీరు పదవిలో కొనసాగనున్నారు.

శోభాయాత్ర

వీర్నపల్లి: మండలకేంద్రంలో మంగళవారం ఉదయం రథంపై అయ్యప్పస్వామి శోభాయాత్రను భూక్య రాములు గురుస్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప పాటలు, మహిళల కోలాటం, నృత్యాల మధ్య స్వామివారి ఊరేగింపు సాగింది. మహిళలు మంగళహారతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్పస్వాములు నీలం రాజేశ్‌, ముత్యం, వెంకటేశ్‌, దేవరాజు ప్రజలు వహిళాభక్తులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధులకు పండ్లు, స్నాక్స్‌ పంపిణీ



పండ్లు అందజేస్తున్న ప్రవాసీ విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట: ప్రవాసీ విద్యార్థులు ఉదారత చాటుకున్నారు. ఎల్లారెడ్డిపేటలోని డేకేర్‌ సెంటర్‌లో, గంభీరావుపేటలోని 'మా' వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు, స్నాక్స్‌ పంపిణీ చేశారు. మండలకేంద్రానికి చెందిన రాగుల నర్సింహారెడ్డి-పద్మ, ఆడెపు శోభ-నాగేశ్వర్‌, గన్న పద్మారెడ్డి-వనజ, గొంగళ్ల ఉమాశంకర్‌-భవానిల కుమారులు సాయికృష్ణారెడ్డి, నటరాజ్‌, చంద్రశేఖర్‌రెడ్డి, సాయిప్రసాద్‌ అమెరికాలోని న్యూజెర్సీలో స్థిరపడ్డారు. సాయికృష్ణారెడ్డి ఇటీవల ఎల్లారెడ్డిపేటకు రాగా వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. డేకేర్‌ సెంటర్‌లోని వృద్ధులకు పండ్లు అందించడంతో పాటు వారికి ఏడాదిపాటు స్నాక్స్‌ అందిస్తామని హామీఇచ్చారు.

విద్యార్థుల క్షేత్రస్థాయి సందర్శన

ముస్తాబాద్‌: మండలంలోని రాఘవేంద్ర పాఠశాల విద్యార్థులు మంగళవారం క్షేత్రస్థాయిలో పంట పొలాలను పరిశీలించారు. దుక్కి దున్నడం, నారు పోయడం, నాట్లు వేయడం ఎలాగో రైతులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన కల్పించినట్లు కరస్పాండెంట్‌ నరేశ్‌ తెలిపారు. ఉపాధ్యాయులు పద్మ, మంజుల, సంధ్య, అపర్ణ, భాను తదితరులు పాల్గొన్నారు.

జీపీ భవనం ప్రారంభం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్‌లో రూ.20 లక్షల ఈజీఎస్‌ నిధులతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని మంగళవారం సర్పంచ్‌ జితేందర్‌ రెడ్డి ప్రారంభించారు. ఎస్సై సుధాకర్‌, ఎంపీటీసీలు, పాలకవర్గం, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టదా?



రెడ్డితండా వద్ద ప్రమాదకరంగా మూలమలుపు



బావుసాయిపేటలో..

- పలుగ్రామాల్లో ప్రమాదకరంగా మూలమలుపులు
- సూచిక బోర్డులు ఏర్పాటు చేయని అధికారులు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

కోనరావుపేట: మండలంలోని పలుగ్రామాల్లోని మూలమలుపులు ప్రమాదకరంగా మారుతున్నాయి. ప్రధాన రహదారుల్లో స్పీడ్‌ బ్రేకర్లు లేక తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

గాయాలపాలవుతున్న వాహనదారులు

మండలంలోని కొలనూర్‌ గ్రామంలో ఉన్న మూలమలుపు వద్ద ఎలాంటి సూచికలు ఏర్పాటు చేయలేదు. ఈప్రాంతంలో ఇదివరకు బోనాలకు చెందిన ఓవ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మల్కపేటలో పలు చోట్ల ఉన్న మూలమలుపులు ఉన్నాయి. వీటితో పాటు నిజామాబాద్‌ క్రాసింగ్‌, ఎల్లమ్మ టెంపుల్‌ వద్ద, నిమ్మపల్లి ప్రాజెక్ట్‌ కట్ట కింద, సుద్దాల-పల్లిమక్త-కనగర్తి గ్రామాల మధ్య మూడు రోడ్లు కలిసే చోట ప్రమాదకరంగా ఉన్నాయి. వేములవాడ నుంచి మరిమడ్లకు వెళ్లే దారిలో మామిడిపల్లి, బావుసాయిపేట, వట్టిమల్ల, రెడ్డితండా గ్రామాల శివారులో ఉన్న మూలమలుపులు వద్ద వాహనదారులు గాయాల పాలవుతున్నారు.

సూచిక బోర్డులు లేవు



మూలమలుపుల వద్ద ఎలాంటి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయలేదు. దీంతో వాహనదారులు నేరుగా ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి ఆయా గ్రామాల్లో ఉన్న మూలమలుపులు గుర్తించి సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలి.

– బైరగోని నందుగౌడ్‌, బావుసాయిపేట

డివైడర్‌ ఏర్పాటు చేయాలి



కోనరావుపేట-నిమ్మపల్లి గ్రామాల మధ్య పలుచోట్ల మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. రోడ్డు మధ్యలో డివైడర్‌ ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి ప్రధాన రోడ్ల మధ్య డివైడర్‌ను ఏర్పాటు చేయాలి.

– నాగండ్ల భూమేశ్‌, నిమ్మపల్లి

త్వరలోనే ఏర్పాటు



కోనరావుపేట నుంచి సిరిసిల్లకు వెళ్లే ప్రధాన రహదారి, వెంకట్రావుపేట, మామిడిపల్లి, వట్టిమల్లలోనే కాకుండా పలుచోట్ల మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే బోర్డులు ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తాం.

– సతీశ్‌, ఏఈ, రోడ్లు భవనాల శాఖ

ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలి

- ప్రభుత్వ విప్‌ ఆది శ్రీనివాస్‌



కోనరావుపేట : మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్‌



సిరిసిల్లటౌన్‌: దరఖాస్తులు స్వీకరిస్తున్న కొండూరి

కోనరావుపేట(వేములవాడ): ప్రజాసంక్షేమం కోసమే ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని ప్రభుత్వ విప్‌ ఆది శ్రీనివాస్‌ అన్నారు. మంగళవారం మండలంలోని నిమ్మపల్లిలో ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. సర్పంచ్‌ శ్రీనివాస్‌, పార్టీ మండలాధ్యక్షుడు షేక్‌ ఫిరోజ్‌పాషా, కిసాన్‌ సెల్‌ అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, నాయకులు గంగాధర్‌, శ్రీనివాస్‌, తదితరులు పాల్గొన్నారు.

2430 దరఖాస్తులు

మండలంలోని పలుగ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలనలో 2430 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. పల్లిమక్తలో 405, కనగర్తిలో 764, నిమ్మపల్లిలో 1177, అజ్మీరాతండాలో 84 దరఖాస్తులు వచ్చాయన్నారు.

సిరిసిల్లటౌన్‌: సిరిసిల్ల పట్టణంలోని 34వ వార్డులో ప్రజాపాలన కార్యక్రమాన్ని ఇన్‌చార్జి కమిషనర్‌ మీర్జా ఫసహత్‌ అలీబేగ్‌, కౌన్సిలర్‌ దార్ల కీర్తన టెస్కాబ్‌ చైర్మన్‌ కొండూరి రవీందర్‌రావు ప్రారంభించారు. పట్టణంలోని 31,32,33,34,35,36,37,38,39 వార్డుల్లో మంగళవారం 7,687 దరఖాస్తులు రాగా ఇప్పటికీ 21,181 దరఖాస్తులు అందినట్లు కమిషనర్‌ వెల్లడించారు. డీఈ ప్రసాద్‌, అధికారులు, అన్ని వార్డుల కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ: ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకోవాలని మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ రామతీర్థపు మాధవి అన్నారు. పట్టణంలోని 14, 15, 16వ వార్డులలో ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించారు.

చందుర్తి: మండలంలోని సనుగుల, కిష్టంపేట, ఎన్గల్‌లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలకు జెడ్పీటీసీ నాగం కుమార్‌ హాజరయ్యారు.

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని లింగన్నపేటలో 1893, కొత్తపల్లిలో 1655 దరఖాస్తులు స్వీకరించినట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌ తెలిపారు. లింగన్నపేట సభలో టెస్కాబ్‌ చైర్మన్‌ రవీందర్‌రావు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో..

ప్రజాపాలన గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చీటి ఉమేశ్‌రావు అన్నారు. కొత్తపల్లిలో ప్రజాపాలన సభలో ఆయన పాల్గొన్నారు.

వేములవాడరూరల్‌: ప్రజాపాలనను వినియోగించుకోవాలని ఎంపీపీ బండ మల్లేశం యాదవ్‌ అన్నారు. ఎదురుగట్ల, బాలరాజుపల్లి, వెంకటాంపల్లిలో ప్రజాపాలన నిర్వహించారు. ఆర్డీవో మధుసూదన్‌గౌడ్‌, తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలంలో ప్రజాపాలనకు మంగళవారం నాటికి 3245 దరఖాస్తులు వచ్చాయని మండల అభివృద్ధి అధికారి నరేశ్‌ కుమార్‌ అన్నారు. అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

బోయినపల్లి: మర్లపేట, నర్సింగాపూర్‌, మాన్వాడ, నీలోజిపల్లిలో ప్రజాపాలన నిర్వహించారు.

ముస్తాబాద్‌: ప్రజాపాలనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ శరత్‌రావు అన్నారు. మద్దికుంట, మోహినికుంట, రామలక్ష్మణపల్లెలో జరిగిన ప్రజాపాలలో మాట్లాడారు.

తంగళ్లపల్లి: ప్రజాపాలన కార్యక్రమం మండలంలో కొనసాగుతోంది. ప్రత్యేక అధికారులు ఎంపీడీవో పి.లచ్చాలు, తహసీల్దార్‌ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో ఇందిరానగర్‌, జిల్లెల్ల, కస్బేకట్కూర్‌, లక్ష్మీపూర్‌లో దరఖాస్తులు స్వీకరించారు. ఇన్‌చార్జి ఎంపీవో విజయేందర్‌ రెడ్డి, ఏవో సందీప్‌, ఏపీవో నాగరాజు, ఆర్‌ఐ మధు, అధికారులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలనకు వెంకటాపూర్‌లో 1132, దుమాలలో 786, తిరెడ్డిపల్లిలో 150, రిదాస్‌నగర్‌లో 440 మంది లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్నట్లు ఎంపీడీవో చిరంజీవి తెలిపారు. జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు,తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ నాయకుల పరిశీలన

వెంకటాపూర్‌, దుమాల లో ప్రజాపాలనను కాంగ్రెస్‌ నాయకులు పరిశీలించి, దరఖాస్తులు స్వీకరించారు. పార్టీ మండలాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, జిల్లా కార్యదర్శి లింగంగౌడ్‌, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్‌

వేములవాడఅర్బన్‌: మండలంలోని మారుపాక గ్రామంలో మంగళవారం ప్రజాపాలన కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్‌ పూజారి గౌతమి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీడీవో శ్రీధర్‌, సర్పంచ్‌ చెన్నమనేని స్వయంప్రభ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి పదోన్నతి



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

వేములవాడఅర్బన్‌: వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్‌ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న తిరుకోవెల శ్రీనివాస్‌ అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ నుంచి అసోసియేట్‌ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందినట్లు ప్రిన్సిపాల్‌ వడ్లూరి శ్రీనివాస్‌ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 14 ఏళ్లుగా తిరుకోవెల శ్రీనివాస్‌ వివిధ కళాశాలల్లో పనిచేశారని, సుమారు వందకుపైగా జాతీయ, అంతర్జాతీయ స్థాయి సెమినార్లలో పాల్గొన్నారని పేర్కొన్నారు. లెక్చరర్‌, ఎఫ్‌ఏసీ ప్రిన్సిపాల్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌, ఎన్‌ఎస్‌ఎస్‌ కో ఆర్డినేటర్‌గా వివిధ హోదాల్లో సేవలందించారని వివరించారు. పదోన్నతి పొందిన శ్రీనివాస్‌ను ప్రిన్సిపాల్‌, అధ్యాపకులు సన్మానించారు. అధ్యాపకులు మధు రాజేశ్‌, వెంకటేశ్వర్లు, అఫ్సారీ ఉస్మాని, రాజేశ్‌ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

27వ సారి రక్తదానం

బోయినపల్లి: మండలంలోని బూర్గుపల్లి గ్రామానికి చెందిన పెరుక మహేశ్‌ మంగళవారం 27వ సారి రక్తదానం చేశాడు. వేములవాడ మండలం నాంపల్లి గ్రామానికి చెందిన రాజవ్వ అనే వృద్ధురాలికి ఆపరేషన్‌ నిమిత్తం ఓ ప్లస్‌ రక్తం అవసరం పడింది. ఈ క్రమంలో మహేశ్‌ రక్తదానం చేసి ఆదుకున్నాడు.

తంగళ్లపల్లి: మండలంలోని అంకుషాపూర్‌ గ్రామానికి చెందిన కోడిబాబు రోడ్డు ప్రమాదానికి గురరయ్యాడు. అత్యవసరంగా రక్తం అవసరం ఉండగా చిన్నలింగాపూర్‌ ప్రభుత్వ ఉపాధ్యాయుడు హరికృష్ణా రెడ్డి రక్తదానం చేశాడు.

ఆస్పత్రికి వృద్ధుడి తరలింపు

వేములవాడఅర్బన్‌: వేములవాడ మున్సిపల్‌ పరిధి తిప్పాపూర్‌ శివారులోని వేములవాడ – సిరిసిల్ల రహదారిపై గుర్తు తెలియని ఓ వృద్ధుడు మానసిక స్థితి బాగాలేక రోడ్డుపై ఉన్నాడు. స్థానికులు 108కు సమాచారం అందించగా 108 సిబ్బంది వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

బోరుబావి తవ్వకం

గంభీరావుపేట(సిరిసిల్ల): కొత్తపల్లిలోని నాలుగో వార్డులో ప్రజల తాగునీటి అవసరాల కోసం కాంగ్రెస్‌ నాయకులు మంగళవారం బోరుబావి తవ్వించారు. తాగునీటి ఇబ్బందులను కాలనీవాసులు కాంగ్రెస్‌ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, జిల్లా నాయకులు కొమిరిశెట్టి తిరుపతి దృష్టికి తీసుకెళ్లారు. వారి సమస్యను గుర్తించిన నాయకులు బోరుబావి తవ్వించారు. కాలనీవాసులు, కాంగ్రెస్‌ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

భూమిపూజ

కోనరావుపేట: మండలంలోని మామిడిపల్లిలో మున్నూరుకాపు సంఘ భవన నిర్మాణ పనులను సర్పంచ్‌ కొక్కుల భారత మంగళవారం ప్రారంభించారు. భవనానికి రూ.3 లక్షలు ఎమ్మెల్యే నిధులు మంజూరయ్యాయి. కార్యక్రమంలో ఉపసర్పంచ్‌ ఎల్లాల రాంరెడ్డి, మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు సాసాల రాజారాం, ఉపాధ్యక్షుడు సాసాల గంగయ్య, సాసాల మల్లారెడ్డి, మల్లేశం, రాజయ్య, శ్రీనివాస్‌, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

వేములవాడఅర్బన్‌: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆర్బీఎస్కే వైద్యులు మంగళవారం లహరిక, పావని పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమున్నవారికి ఉచితంగా మందులు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ ప్రమోద్‌కుమార్‌, అధ్యాపకులు అంజయ్య, విద్యార్థులు తదితరులున్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలం రేపాక గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మానకొండూర్‌ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణపై అనుచిత వాఖ్యలు చేస్తూ వాట్సాప్‌ గ్రూపులో పోస్ట్‌ చేయడంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మంగళవారం ఇల్లంతకుంట పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సుధాకర్‌కు ఫిర్యాదు చేశారు. రేపాక ఎంపీటీసీ కథ సుమలత మల్లేశం, చంద్రు, భారత్‌ రెడ్డి, గూడ నరేందర్‌ రెడ్డి ఉన్నారు.

కేకేను విమర్శించే అర్హత కేటీఆర్‌కు లేదు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర నాయకుడు కేకే.మహేందర్‌ రెడ్డిని విమర్శించే అర్హత ఎమ్మెల్యే కేటీఆర్‌కు లేదని తంగళ్లపల్లి కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు ప్రవీణ్‌ జే టోని అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. విచక్షణ కోల్పోయి కేకేపై అనుచిత వాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. మాటప్రకారం విలీన గ్రామాలను కాంగ్రెస్‌ ప్రభుత్వం కాపాడుతుందన్నారు. త్వరలో నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌ నాయకులు చేసిన దోపిడీ వివరిస్తామని చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ మహిళా అధ్యక్షురాలు హారికా రెడ్డి, నాయకులు శ్రీకాంత్‌ గౌడ్‌, రాజు, రాజశేఖర్‌, మధుకర్‌, పరుశరాములు, భరత్‌ గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అయోధ్య రాముడి అక్షింతలు అందజేత



రాములోరి అక్షింతలు అందిస్తున్న ట్రస్ట్‌ సభ్యులు

వేములవాడ: అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్‌ ఆధ్వర్యంలో ఇంటింటికీ శ్రీరాముని అక్షింతల పంపిణీ కార్యక్రమంలో భాగంగా వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్‌ ఆది శ్రీనివాస్‌కు మంగళవారం పట్టణ శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌ సభ్యులు అక్షింతలు అందజేశారు. కార్యక్రమంలో గడప కిషోర్‌రావు, మోటూరి మధు, విశాల్‌ తదితరులు అందజేశారు.

వందశాతం ఫలితాలు సాధించాలి



విద్యార్థితో చదివిపిస్తున్న డీఈవో రమేశ్‌కుమార్‌

బోయినపల్లి(చొప్పదండి): పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో రమేశ్‌కుమార్‌ పేర్కొన్నారు. మండలంలోని స్తంభంపల్లి హైస్కూల్‌, బోయినపల్లి మోడల్‌స్కూల్‌ను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఎల్‌ఎన్‌ ఉన్నతి లక్ష్య రిజిష్టర్లను తనిఖీ చేసి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. బోధన ఎలా ఉంది.. తదితర విషయాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మరో రెండు నెలల్లో పదో తరగతి పరీక్షలు ఉన్న క్రమంలో ప్రత్యేక తరగతులు నిర్వహించి వంద శాతం ఫలితాలు వచ్చేలా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట హెడ్‌మాస్టర్‌ అల్తాఫ్‌ అహ్మద్‌, ఉపాధ్యాయులు ఉన్నారు.

'ఆరోగ్య మహిళ'కు స్పందన



సిరిసిల్లటౌన్‌: జిల్లాలో ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళ శిబిరానికి మంచి స్పందన వస్తుందని డీఎంహెచ్‌వో డాక్టర్‌ సుమన్‌ మోహన్‌రావు తెలిపారు. సిరిసిల్లలోని పీఎస్‌నగర్‌, వేములవాడ పీపీసీ, నేరెళ్ల పీహెచ్‌సీ, తంగళ్లపల్లి పీహెచ్‌సీల్లో మహిళలకు ఉచితంగా వైద్యారోగ్య పరీక్షలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా వివిధ హెల్త్‌సెంటర్లలో నిర్వహించిన శిబిరాల్లో ఓపీడీ 545, బ్రెస్ట్‌ 545, ఓరల్‌ కావిటీ 545 పరీక్షలు జరిపినట్లు పేర్కొన్నారు. ఇవి కాకుండా యూటీఐ11, ల్యాబ్‌ 45, థైరాయిడ్‌ 37, విటమిన్‌ డీ 28, సీబీపీ 37, సూక్ష్మ పోషకాలు 36 మందికి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. వీరిలో ముగ్గురిని జిల్లాసుపత్రికి రెఫర్‌ చేసినట్లు వెల్లడించారు. ఆయా ఆరోగ్య కేంద్రాల మెడికల్‌ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అమరవీరుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న గుంటి వేణు

సిరిసిల్లటౌన్‌: అమరవీరుల కాంస్య విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కోరారు. మంగళవారం సిరిసిల్ల కార్మిక భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లా నుంచి కామ్రేడ్లు బద్దం ఎల్లారెడ్డి, సింగిరెడ్డి భూపతిరెడ్డి, మరో పన్నెండు మంది యుద్ధంలోఅమరులైనట్లు తెలిపారు. గతంలో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వానికి పలుసార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం తెలంగాణ అమరవీరుల చరిత్రను భవిష్యత్‌ తరాలకు అందించాలని కోరారు. సమావేశంలో నాయకులు పంతం రవి, సోమ నాగరాజు, నల్ల చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతతో నేరాల నియంత్రణ



మాట్లాడుతున్న సీఐ సదన్‌కుమార్‌

ముస్తాబాద్‌ : ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలను నియంత్రించవచ్చని సీఐ సదన్‌కుమార్‌ అన్నారు. మండలంలోని తెర్లుమద్దిలో నాయకడు ల గిశెట్టి శ్రీనివాస్‌ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మంగళవారం ప్రారంభించారు. సీసీ కెమెరాలతో నేరాల తీరు తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ కిషన్‌రావు, ఎస్సై శేఖర్‌రెడ్డి,చంద్రయ్య, మల్లేశ్‌, శ్రీనివాస్‌, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్లఎడ్యుకేషన్‌: జిల్లాలో పోస్టుమెట్రిక్‌ ఉపకార వేతనాలు అందుకునే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్‌ కులాల అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్‌ మంగళవారం ప్రకటనలో తెలి పారు. ఈ నెల 31వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉందని పేర్కొన్నారు. కొత్తగా దరఖాస్తు, రెన్యువల్‌ చేసుకునేవారు సంబంధిత విద్యాలయంలో అన్ని వివరాలు తెలుసుకుని తగు ధ్రువీకరణపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

సిరిసిల్లక్రైం: వాహన జరిమానాల్లో రాయితీని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ అఖిల్‌ మహాజన్‌ పేర్కొన్నారు. గతనెల 26న పెండింగ్‌ చలాన్లలో రాయితీ కల్పిస్తూ ఆదేశాలు వెలువడ్డాయని, ఈ నెల 10 తేదీలోపు గడువు ముగియనుందని, వినియోగించుకోవాలన్నారు. ద్విచక్ర, త్రిచక్ర వాహనాలకు 80 శాతం, ఆర్టీసీ బస్సులు 90శాతం, నాలుగుచక్రాల వాహనాలకు, లారీలకు, భారీ వాహనాలకు 60 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు.

కార్మికులకు పని కల్పించాలని ధర్నా



ధర్నా చేస్తున్న కార్మికులు, నాయకులు

సిరిసిల్లటౌన్‌: డివైడర్లు, పార్కుల్లో పనిచేసే గ్రీనరీ, పారిశుధ్య కార్మికులకు పని కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మూశం రమేశ్‌ డిమాండ్‌ చేశారు. మంగళవారం సిరిసిల్ల మున్సిపల్‌ ఎదుట కార్మికులతో ధర్నా చేపట్టి మాట్లాడారు. పార్కులు, డివైడర్లు, ముక్తిధామాలు తదితర ప్రాంతాల్లో గ్రీనరీ, పారిశుధ్య పనులకు కొత్తగా టెండర్‌ వేయించి ఇప్పటి వరకు పనిచేస్తున్న కార్మికులకు పనులు ఇవ్వాలన్నారు. కార్మికులకు ఇప్పటి వరకు నిలిపివేసిన జీతాలను కాంట్రాక్టర్లతో ఇప్పించాలని కార్యాలయంలో వినతిపత్రం అందించారు. నర్సయ్య, శాంతమ్మ, రమణమ్మ, గీత, వసంత, మణెమ్మ, లక్ష్మి, శ్రీకాంత్‌, రాకేశ్‌, వంశీ, కళ్యాణ్‌ తదితరులు పాల్గొన్నారు.

వికసిత్‌ భారత్‌ సంకల్ప యాత్ర



వీర్నపల్లి: మండలంలోని అడవిపదిరలో మంగళవారం వికసిత్‌ భారత్‌ సంకల్ప్‌ యాత్రను సర్పంచ్‌ లక్ష్మీరాజం ఆధ్వర్యంలో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. ఆయుష్మాన్‌ భారత్‌ కార్డులగురించి వివరిస్తూ పలువురికి మందులు అందజేశారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌ మేనేజర్‌ భూపేందర్‌ రెడ్డి రైతుల రుణాలగురించి వివరించారు. సంకల్ప యాత్రలో భాగంగా ప్రతిజ్ఞ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యదర్శి రాజు అధికారులు పాల్గొన్నారు.